అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 1 జూన్ 2023
1

తెలంగాణ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



లక్ష్మణచాంద : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల విజయవంతానికి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరిని ఉత్సవాలలో భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్, ఆయిల్ చోరీ

నవతెలంగాణ-కడెం



కడెం గ్రామ శివారులో గల సీడ్ ఫామ్‌కి సంబంధించిన 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. ఏఈ, ఎస్ఐ, వ్యవసాయ శాఖ ఎడి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను వగులగొట్టి అందులోని కాపర్ వైర్, ఆయిల్ ఇతర సామాగ్రిని ఎత్తుకుపోయారు. నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజు తెలిపారు.

కల్లాల్లో ధాన్యం..కళ్లలో భయం..!

- కేంద్రాల్లో తూకం వేసినా రోజుల తరబడి అక్కడే
- లారీల కొరతతో మిల్లులకు తరలించని వైనం
- ఇప్పటికే తడిసిన వడ్ల బస్తాలతో రైతుల అవస్థలు
- మూడు రోజుల వర్షసూచనతో మరింత ఆందోళన



మంగళవారం రాస్తారోకో చేస్తున్న రైతులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, దండేపల్లి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో యాసంగిలో సుమారు లక్షకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల్లోనూ వేల ఎకరాల్లో ఈ పంట సాగైంది. ప్రస్తుతం పంట ఇంటికి రావడంతో అనేక మంది రైతులు ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లారు. కానీ కొనుగోలు కేంద్రాల్లో అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే దాదాపు పూర్తికావాల్సిన కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరగడం.. మిల్లులకు తరలించడంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అన్నదాతలు అనేక పాట్లు పడుతున్నారు. లారీల కొరతను సాకుగా చూపిస్తూ తూకం వేసిన వడ్ల రాశులను రోజుల తరబడి అక్కడే ఉంచుతున్నారు. మిల్లులకు తరలించకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు. లారీల కొరత ఉండటంతో ఇదే అదనుగా కొందరు లారీ డ్రైవర్లు బస్తాకు రూ.5చొప్పున అందజేయాలని రైతులను డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మిల్లులకు త్వరగా తరలించాలంటే ఈ కమీషన్ ముట్టజెప్పితనే తీసుకెళ్తామంటూ హుకుం జారీ చేస్తున్నట్లు కొందరు రైతులు వాపోతున్నారు. ఒక్కో లారీలో సుమారు 400బస్తాలు పడుతాయి. ఈ లెక్కన ఒక్కో లారీ డ్రైవర్‌కు రూ.2వేల వరకు అందజేయాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలు సమకూర్చి ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

ఆకాశం వైపు ఆందోళనగా..!

మంచిర్యాలలో యాసంగిలో లక్షకు పైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. పంట చేతికొచ్చిన తర్వాత వడ్లను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన అన్నదాతలకు ఊహించని పరిణామం ఎదురైంది. మంచిర్యాల జిల్లాలో 266 కొనుగోలు కేంద్రాలకు గాను 233 కేంద్రాలను ఏర్పాటుచేశారు. డీఆర్‌డీఏ(ఐకేపీ) ఆధ్వర్యంలో 41 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 110 కేంద్రాలు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 82 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి పరిధిలో 16,311మంది రైతుల నుంచి 2.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మరో 40లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లోనే యాసంగి ధాన్యం ఉండటం..మిల్లులకు తరలించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడం.. ధాన్యం అతలాకుతలం కావడం..మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పడంతో మరింత దిగాలు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని దండేపల్లి, నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో రైతులు రాస్తారోకో చేపట్టారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కోరుతున్నా..అధికారులు సరిపడా లారీలను సమకూర్చడం లేదనే విమర్శలున్నాయి. మిల్లులకు వెళ్లిన బస్తాలను ఆన్‌లోడింగ్ చేయడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఆరుగాలం

కష్టించి పండించిన వడ్లరాశులు కల్లాల్లో ఉన్నాయి.. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసినా లారీల కొరత కారణంగా రోజుల తరబడి అక్కడే ఉంటున్నాయి. మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మరోవైపు మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వడ్ల బస్తాలు అతలాకుతలమయ్యాయి. మరో మూడు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచించడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. సాయంత్రం కాగానే ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఏ క్షణంలో వర్షం వస్తుందో తెలియక కండ్లలో భయంతో ఉన్నారు. కొనుగోళ్లలో ఆలస్యం జరగడం.. అధికారులు పట్టించుకోకపోవడం మూలంగా కర్షకులు అష్టకష్టాలు పడుతున్నారు. పంటను పండించడం ఎంత కష్టమో.. మార్కెట్‌లో విక్రయించడమూ అంతే కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కొనుగోళ్లల్లో వేగం పెంచాలని రైతులు కోరుతున్నారు.



తడిసిన ధాన్యం బస్తాలు

ధాన్యం తూకం వేసి వారం రోజులు అవుతోంది : వైష్ణవకృష్ణ, రైతు, చెల్కగూడ



అష్టకష్టాలు పడి పండించిన పంట చేతికొచ్చాక కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం తూకం వేసి వారం రోజులు గడుస్తుంది. లారీలు రావడం లేదనే సాకుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సోమవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి ధాన్యం బస్తాలు పూర్తిగా తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ధాన్యం తరలించేందుకు కొందరు లారీ డ్రైవర్లు బస్తాకు రూ.5చొప్పున అందజేయాలని చెబుతున్నారు. ఇలా ఇస్తే రైతులకు మరింత భారం పడుతుంది. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం వెంటనే తరలించాలి.

లారీలు రావడంలేదని నిలిపేశారు : బందెల శ్రీనివాస్‌గౌడ్, రైతు, రెబ్బనపల్లి



ధాన్యం తూకం వేసి పది రోజులు గడుస్తుంది. లారీలు వస్తలేవని ధాన్యం తరలింపు నిలిపివేశారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకుని వెంట తిరిగినా ఫలితం లేదు. బస్తాలు పూర్తిగా తడిసి ముద్దయిపోయాయి. తడిసిన ధాన్యం కొనుగోలు చేయమని మళ్లీ పేచీలు పెడతారు. దీనివల్ల నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. లారీ డ్రైవర్, హామాలీ ఖర్చులు కూడా తామే భరించాల్సి వస్తోంది. మళ్లీ ఏదో ఒక సాకు చెప్పి మిల్లర్ల వద్ద కటింగ్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే తడిసిన ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలి.

ప్రకాష్ అంబేడ్కర్ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ మనువడు ప్రకాష్ అంబేద్కర్ సభను విజయవంతం చేయాలని నేతకాని మహార్ సంఘం జాతీయ కన్వీనర్ బోర్ల కుంట దీపక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 70 ఏండ్లు దాటినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడలేక పోతున్నాయని విమర్శించారు. దళిత కుటుంబాలు నేటికీ వివక్షతకు గురవుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీల మహిళలు నేటికీ అఘాయిత్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం జూన్ 6న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జరిగే సభకు అర్‌పిఐ జాతీయ అధ్యక్షులు ప్రకాష్ అంబేద్కర్ రానున్నారని, ప్రజలు అధికసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాన్‌సేన్, బాబాసాహెబ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-బోథ్

రైతు వేదికలో బుధవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మొదట వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న సమయంలో ఖరీఫ్ పంటలు వేసే రైతులు భూమిలో తేమ శాతం ఎక్కువ ఉన్నప్పుడు విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. విద్యుత్, ఇరిగేషన్, పౌర సరఫరాలు, ఐసిడిఎస్, ఈజీఎస్ అధికారులు నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపిడిఓ లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్‌మాన్‌సింగ్, పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బండారు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్ యాదవ్ పలువురు ఎంపిటిసి, సర్పంచులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ నిరసన

ఎంపిపి తుల శ్రీనివాస్ పనులు ఇప్పిస్తానని తన దగ్గర రూ.50వేలు తీసుకొని ఇవ్వడం లేదని వైఎస్ ఎంపీపీ నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో కింద కూర్చొని నిరసన తెలిపాడు. డబ్బులు ఇచ్చేదాకా ఇక్కడి నుంచి కదిలేది లేదని కూర్చుండిపోయాడు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో నిరసన విరమించాడు.

ఘనంగా సినీ నటుడు కృష్ణ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

దివంగత సినీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలను బుధవారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. తమ అభిమాన నటుడు భౌతికంగా లేకపోయినా ఆయన నటించిన సినిమాల రూపంలో ఎప్పుడూ బతికే ఉంటారని అభిమాన సంఘం అధ్యక్షుడు సెవ్వ జగదీష్ కొనియాడారు. ముందుగా కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకొని కెఆర్‌కె కాలనీలోని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమాన సంఘం నాయకులు సెవ్వ జగదీష్ మాట్లాడుతూ తమ అభిమాన కథానాయకుడు కృష్ణ చొరవతోనే తెలుగులో తొలి సినిమాస్కోప్, తొలి 70ఎంఎం, స్టీరియో ఫోనిక్ సౌండ్ సిస్టం వచ్చాయని గుర్తు చేశారు. తెలుగు సినిమా పరిశ్రమలో ఆయన చేసినన్ని పాత్రలు, సాహసాలు వేరొకరు చేయలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ పరమేశ్వర్, ఎఎంసీ చైర్మన్ కుమ్ర లక్ష్మిరాజు, బీఆర్ఎస్ నాయకులు విజ్జగిరి నారాయణ, కృష్ణ అండ్ మహేష్ సేన అభిమానులు ఎం,రమేష్, మోతీరాం, మనోజ్, అరుణ్, సతీష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బాసర : బిఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దేగామలోని ఆయన నివాసంలో మండలంలోని బీదరెల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు బిఆర్ఎస్‌లో చేరారు. వారికి స్వాగతం పలికి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. బిఆర్ఎస్ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ కన్వీనర్ కోర్వ శ్యామ్, యువజన విభాగం అధ్యక్షులు ఆకాష్ పటేల్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ నడవాలంటే నెట్టాల్సిందే..!

- నిత్యం గోస పడుతున్న పారిశుధ్య కార్మికులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలోని చెత్తను తరలించే ట్రాక్టర్ మొరాయించడంతో పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. చెత్త సేకరణ సమయంలో ఆపిన ప్రతి చోట కార్మికులకు ట్రాక్టర్‌ను తోయాల్సిన దుస్థితి నెలకొంది. బ్యాటరీ చెడిపోయి నెల రోజులు అవుతున్నా అధికారులు బాగుచేయించడం లేదు. దీంతో ఆగిన చోట ట్రాక్టర్ స్టార్ట్ కాక డ్రైవర్, కార్మికులు అవస్థ పడుతున్నారు. ఫలితంగా పట్టణంలోని చెత్తను సకాలంలో సేకరించని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. బుధవారం మూడవ వార్డులోని కసాబ్ గల్లీలో ట్రాక్టర్ మొరాయించడంతో కార్మికులు దాన్ని తోసుకుంటూ వెళ్లడం చూపరులకు ఆశ్చర్యం కలిగించింది. చిన్నపాటి సమస్యను పరిష్కరించడంలో మున్సిల్ అధికారులు నిర్లక్ష్యం చేయడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా మున్సిల్ పాలకవర్గం, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి కార్మికులకు ఇబ్బంది చెత్తసేకరణ వాహనాలకు ఎప్పటికప్పుడు కలగకుండా చూడాలని కోరుతున్నారు.

తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి

- అనసూయ పవర్ ట్రస్ట్ చైర్మన్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని అనసూయ పవర్ ట్రస్ట్ చైర్మన్ పవర్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం రాత్రి ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గంలోని పలు పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు 10/10 జిపిఎ సాధించిన సందర్భంగా వారిని సత్కరించి అభినందించారు. 51 మంది విద్యార్థులకు మెమెంటోను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. చదువుతోనే అనుకున్నది సాధించగలుగుతామన్నారు. పిల్లల కోసం తల్లిదండ్రులు తాపత్రయపడే తీరును ఆయన విద్యార్థులకు చెప్పారు. ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను మరవకూడదన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు 10/10 జీపీఏ సాధించడంశుభ పరిణామన్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మండల విద్యాధికారి సుభాష్, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, శ్రీనివాస్, వందన, వేదం పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలస నాయకులకు టికెట్లు ఇస్తే ఒప్పుకోబోం : చారులత



నవతెలంగాణ-ఉట్నూర్

కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని భావిస్తున్న కొందరు నాయకులు ధన బలంతో కాంగ్రెస్ పార్టీలో చేరి టికెట్లు పొందాలని భావిస్తున్నారని, ఎన్నికల సమయంలో వలస నాయకులుగా వచ్చే వారికి టికెట్లు ఇస్తే తాము సహించబోమని జెడ్పీటీసీ చారులత అన్నారు. బుధవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ఆశావాహులు అనేక మంది పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి పార్టీ జెండాను మోస్తున్న వారికి కాకుండా వలస నాయకులకు టికెట్లు ఇస్తే సహించేది లేదన్నారు. పార్టీలో ఉంటు ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నామని, ఎన్నికల సమయంలో ఆర్థిక బలంతో కొందరు నాయకులు టికెట్టు దక్కించుకొని పోటీ చేసి ఓటమి తర్వాత వెళ్లిపోతున్నారని గుర్తు చేశారు. పార్టీ జెండా మోస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను చేపడుతున్న తమకు, వలస నాయకుల వల్ల గుర్తింపు లేకుండా పోతుందని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని, బిజెపికి ఉనికి లేదని, కాంగ్రెస్ పార్టీకి విజయ అవకాశాలు ఉండడంతో ఆర్థికంగా ఉన్నవారు తమ పార్టీలో చేరి టికెట్లు పొందాలని చూస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై టీపీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎగ్బాల్, నాయకులు మల్లారెడ్డి, అర్క సీతారాం పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి అండ

నవతెలంగాణ-ముథోల్

ముఖ్యమంత్రి కేసీఆర్ సిఎం సహాయ నిధి కింద పేద రోగులకు వైద్య ఖర్చుల కోసం చెక్కులను అందజేసి ఆర్థికంగా అండగా ఉంటున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సిఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.37500 చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముథోల్ నియోజకవర్గంలో వివిధ వ్యాధులకు శస్త్ర చికిత్సలు, వైద్య ఖర్చులకు అత్యధిక బిల్లులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చొరవతో సిఎం మంజూరు చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భారీ ఆంజనేయ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్



పట్టణంలోని మహాలక్ష్మివాడలో ఏర్పాటు చేసిన భారీ ఆంజనేయ విగ్రహావిష్కరణ, ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో భాగంగా మూడు రోజులుగా భక్తులు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తి ప్రపత్తులతో చేపట్టగా బుధవారం ఉదయం నుండే భారీగా భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 45 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అట్టహాసంగా ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ విగ్రహావిష్కరణలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండేళ్లుగా కమిటీగా ఏర్పడి భారీ విగ్రహాన్ని ప్రతిష్టించడం పట్ల అభినందనలు తెలిపారు.

రాహుల్ అమెరికా పర్యటనలో కంది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమెరికాలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటనలో ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. బుధవారం శాన్ ఫ్రాన్సిస్కోలో రాహుల్ ఎన్నారైలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మొహిందర్ సింగ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కాంగ్రెస్ యువ నాయకులు, ఎన్నారై కంది శ్రీనివాస్‌రెడ్డి పెద్ద సంఖ్యలో ఎన్నారైలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కంది శ్రీనివాస్‌రెడ్డి రాహుల్ గాంధీని సత్కరించారు.



వేధింపులతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వేధింపులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని పీచర గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం..శిరీష(22) భర్త, బంధువుల వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దశాబ్ది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర శతాబ్ది ఉత్సవాలు, అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా కార్యక్రమాల ప్రత్యేక అధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. అమరవీరులకు నివాళులు, పతాకావిష్కరణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. జూన్ 3న రైతు దినోత్సవ సందర్భంగా జిల్లాలోని 101 రైతు వేదికలను అందంగా అలంకరించి పండగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి రైతు వేదిక వద్ద 1000 మంది రైతులు పాల్గొనేలా వాహనాలు, ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా 10 గంటలకు రైతు వేదికలకు చేరుకోవాలని అన్నారు. రైతు వేదికలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు పంటలపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలని, అలాగే రైతులకు ప్రభుత్వం అందించిన రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్తు తదితర అంశాలపై లబ్ది పొందిన రైతులతో మాట్లాడించాలని సూచించారు. కార్యక్రమానంతరం భోజన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన షామియానాలు, కుర్చీలు, తాగునీరు వంటి సదుపాయాలు సమకూర్చాలని సూచించారు. రైతు వేదికలలో వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు అన్ని అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టాలన్నారు. జూన్ 4న సురక్ష దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. విద్యుత్ విజయోత్సవం సందర్భంగా జూన్ 5న నియోజకవర్గ స్థాయిలో రైతులు, వినియోగదారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో వెయ్యి మందితో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్లను 21 రోజుల పాటు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలని సూచించారు. జూన్ 8న ఊరూరా చెరువుల పండుగ సందర్భంగా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలో చెరువుల వద్ద సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు చెరువుల పండుగ నిర్వహించాలన్నారు. డప్పులు, బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా చెరువుల వద్దకు చేరుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమం అనంతరం రాత్రి భోజనాలకు విద్యుత్ ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. జూన్ 2 నుండి 22 వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా అధికారులతో పాటు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, మిషన్ భగీరథ, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మరింత మెరుగైన వైద్య సేవలందించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

నేషనల్ హెల్త్ మిషన్ కింది ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి ముస్కాన్ అవార్డ్ లభించడం గొప్ప విషయమని, ఏజెన్సీ గిరిజన ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించి మరిన్ని అవార్డులు పొందాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు అన్నారు. ఉట్నూర్ ఆస్పత్రికి ముస్కాన్ అవార్డు రావడం పట్ల డాక్టర్ల కృషి ఎంతో ఉందని ఆస్పత్రి సుపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్, వైద్యులు మహేందర్, మమత, రత్నమాల, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ జాడి విమలను ఆస్పత్రిలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీకి కేంద్ర బిందువు అయిన ఉట్నూర్ కేంద్రంగా ప్రభుత్వ ఆస్పత్రి ముస్కాన్ అవార్డు రావడం అభినందనీయమన్నారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన జాదవ్ ఉపేందర్ హయాంలో ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందు ముందు మరిన్ని అవార్డులు వచ్చేందుకు వైద్యులు, సిబ్బంది మరింత వైద్య సేవలందించి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, బీఆర్ఎస్ యువజన పార్టీ నాయకులు జాదవ్ కపిల్, రవీందర్, రాజ్ కుమార్ ప్రజ్ఞశీల్, వెంకటేష్, శ్రీనివాస్, అజయ్, సునీల్ ఉన్నారు.

బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



నవతెలంగాణ-నిర్మల్

2018 ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో భాగంగా అర్హులైన వారందరికీ జీవనభృతి అందించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. రాజన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్హులైన బీడీ కార్మికులు, బీడీ ప్యాకర్స్ నెలసరి ఉద్యోగులకు, బీడీ కమీషన్‌దారులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2016 జీవనభృతి అందించాలన్నారు. 2018 ఎన్నికల సందర్భంగా 2014 ఫిబ్రవరి 18న కటాఫ్ డేట్ ఎత్తివేసి అర్హులందరికీ జీవనభృతి అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటికీ నేటికి అమలు కాకపోవడం శోచనీయమన్నారు. 58 ఏళ్ల వయస్సు నిండే వరకు జీవనభృతి కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. బక్కన్న, ఎండీ గఫూర్, ఎస్. గంగన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-జైనథ్

కార్గో సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ దుమాల దేవన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ఆర్టీసీ కార్గో సేవల వినియోగ కేంద్రాన్ని సర్పంచ్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అన్ని గ్రామాల ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. వస్తువులను సురక్షితంగా పలు ప్రదేశాలకు చేరవేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోడిచర్ల లస్మన్న, దేవాదాయ చైర్మన్ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, లింగన్న, శంకర్, సారధి పాల్గొన్నారు.

ఎవరి కోసం ఈ దశాబ్ది ఉత్సవ ఆర్భాటాలు?



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ప్రభుత్వం జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవ ఆర్భాటాలు ఎవరి కోసమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నంది రామయ్య విమర్శించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేయడానికి వివిధ కార్యక్రమాలు తలపెట్టి, అందుకు తగిన బడ్జెట్ కూడా కేటాయించిందన్నారు. కానీ 2 నెలలుగా రైతులు ఐకేపీ సెంటర్లలో ధాన్యం పోసి ఉంచితే, గోనె సంచులు లేవని, లారీలు రావడం లేదని సాకులు చెప్పి ధాన్యం కొనుగోళ్లు నిలిపివేశారన్నారు. కొత్త ఆసరా పెన్షన్ల ఊసులేదు, ఉద్యోగులకు జీతాలు లేవని, ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆవేదనవ్యక్తం చేశారు. ఏ ప్రజాస్వామిక ఆకాంక్షలతో నిలువెత్తు ఉద్యమం నిర్మించి, వందలాది మంది బలిదానాలు చేశారో ఆ ఆశలు, ఆకాంక్షలు ఈ పదేండ్లలో నెరవేరలేదని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన వాళ్లను మోసం చేసి తెలంగాణ ద్రోహులను అందలమెక్కించారని అన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర 7వ మహాసభ జూన్ 2 నుంచి 12వరకు 'తెలంగాణ ప్రజల ఆకాంక్షల దీక్షా దివస్' జరిపేందుకు నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా అన్ని మండలాల్లో, గ్రామాల్లో దీక్షలు, ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. ప్రజలందరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, జిల్లా నాయకులు ఎం.బక్కన్న, ఎస్. గంగన్న, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మహేందర్, జగన్ సింగ్, మహమూద్ పాల్గొన్నారు.

ఆర్‌పీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా కారేం నివేదిత



నవతెలంగాణ-నిర్మల్

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థిగా కారేం నివేదితను నియమించినట్లు పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి గవ్వల శ్రీకాంత్ తెలిపారు. ఐబీలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు నిర్మల్‌కు ఎమ్మెల్యేగా పనిచేసిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు వారి స్వార్థం కోసం పనిచేశారన్నారు. నిర్మల్ నియోజకవర్గానికి బహుజన బిడ్డ ఎన్నిక కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకుంటున్నారని, అందుకే బహుజన బిడ్డ కారేం నివేదితను పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేశామన్నారు. అలాగే జూన్ 6న ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. ఇందులో నాయకులు మహ్మద్ రహీం, తీగల శేఖర్, ప్రసేన్‌జిత్ పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని బోరిగామలో మండల వైద్యాధికారి సాగర్, వైద్య సిబ్బంది, గ్రామస్తులుతో కలిసి ర్యాలీ నిర్వహించి పొగాకుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సాగర్ మాట్లాడుతూ ఆహారం కావాలిగాని పొగాకు ముఖ్యం కాదని అన్నారు. పొగాకు ఉత్పత్తులు ఏవీ కూడా వినియోగించవద్దని, వాటిని వాడటం వల్ల భయంకరమైన క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు రాజకిరణ్‌రెడ్డి, ఎఎన్ఎం కరుణ, ఆశా కార్యకర్త గంగమ్మ మహిళలు, బాలబాలికలు పాల్గొన్నారు.

ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యలు సరికాదు



నవతెలంగాణ-ఉట్నూర్

మతమార్పిడి చేస్తే బుల్లెట్లు దింపుతామంటూ ఎంపీ సోయం బాపురావు పాస్టర్లను హెచ్చరించడం సరైందికాదని క్రిస్టియన్ పాస్టర్ అసోసియేషన్స్ డివిజన్ అధ్యక్షుడు డానియల్, కార్యదర్శి జోసెఫ్ అన్నారు. బుధవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసనం ద్వారా ఎన్నికైన ఎంపీ ఇతర మతాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. రాజ్యాంగబద్ధంగా సమాజ సేవ చేస్తున్న ప్లాస్టర్స్ ఎవరు మతమార్పిడిలకు పూనుకోవడం లేదని, దురలవాట్లకు లోను అవుతున్నవారి జీవితం మార్చుకోవాలన్న ఉద్దేశంతో తమ వద్దకు వస్తున్నారని తెలిపారు. ప్రజల ఓట్లతో గెలిచి లౌకిక రాజ్యంలో బుల్లెట్లు దింపుతాం అంటూ హెచ్చరికలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తాము ఎవరినైన ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దేశ ప్రధానమంత్రి బిషప్లను కలుస్తూ మర్యాదగా మాట్లాడుతున్నారని, అదే పార్టీకి చెందిన ఎంపీ పాస్టర్లను ఉద్దేశించి ఇలా భయభ్రాంతులకు గురి చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎంపీ వాఖ్యానించిన మాటలను ఉపసంహరించుకొని పాస్టర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ పాస్టర్ అసిసియేషన్ సభ్యులు రాజారత్నం, తిమోతి ఏలియా, అంద్రుస్, పీటర్ పాల్గొన్నారు.

సామూహిక కిచెన్ గార్డెన్ ఏర్పాటు



నవతెలంగాణ-ముధోల్

ముధోల్‌లోని ఐకెపి కార్యాలయ ఆవరణలో ఈజీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. తీగజాతి, కూరగాయలతో పాటు ఆకు కూరగాయాలను నాటారు. సంపూర్ణ ఆరోగ్యం కొరకు ఎంతో దోహదపడుతాయని, ప్రతిఒక్కరు ఇంటి వద్ద రసాయనరహిత కూరగాయలు, ఆకు కూరగాయలు పండించుకోవచ్చని ఎంపిడిఓ సురేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, ఎంపీవో అమీర్‌ఖాన్, ముధోల్ సర్పంచ్ రాజేందర్, ఎంపిటిసి భూమేష్, ఎపియం గురుచరణ్, సిసిలు వందేమాతరం, సూర్యకాంత్, సమాఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నటరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురి చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఇలాంటి చర్యలు చేపడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేస్రం ప్రవీణ్, జిల్లా నాయకులు పెందుర్ తుకారాం, ఆకాష్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ద ఉత్సవాల నేపథ్యంలో బుధవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2నుండి 22 వరకు అన్ని గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు నిర్వయించాలని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏఓ రాజశేఖర్‌రెడ్డి, పిఆర్ ఏఈ శరత్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రకాష్, పశు వైద్యాధికారి ముక్తార్, డిటి రవీందర్, ఎపిఓ మాధురి, అంగన్వాడీ సూపర్‌వైజర్ విజయగౌరీ, పలువురు ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభాస్థలిని పరిశీలించిన మంత్రి



నవతెలంగాణ-నిర్మల్

సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ భవన కార్యాలయంలో ఏర్పాట్లను, సీఎం సభాస్థలి మైదానాన్ని బుధవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు. బిఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం, బహిరంగ సభ వద్ద ముఖ్యమంత్రి వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్ల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. బహిరంగ సభ వద్ద జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మార్కెట్ చైర్మన్ చిలుక రమణ, ఎంపిపి రామేశ్వర్‌రెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, పాకాల రాంచందర్ పాల్గొన్నారు.

వివిధ పద్ధతులతో పత్తిలో అధిక దిగుబడి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

వివిధ పద్ధతులు పాటిస్తే పత్తిలో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాధారంగా పత్తి పంటను సాగు చేస్తున్న భూములలో 60 నుంచి 70 మిల్లీమీటర్లు, ఎర్రచల్క భూములలో 50 నుంచి 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినప్పుడు మాత్రమే విత్తుకోవాలన్నారు. జూన్ 15 లోపు విత్తితే దిగుబడులు అధికంగా ఉంటాయని, జూలై 15 తర్వాత మాత్రం విత్తనాలను విత్త కూడదని పేర్కొన్నారు. తేలిక నేలల్లో పత్తిని సాగు చేసినప్పుడు తప్పనిసరిగా మొక్కల సంఖ్య మామూలు కంటే ఎక్కువగా ఉండేటట్లు దగ్గరగా విత్తుకోవాలని తెలిపారు. నేల స్వభావాన్ని, నీటి వసతులను దృష్టిలో ఉంచుకొని సరైన రకాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తనం మోతాదు హైబ్రిడ్ వంగడాలకు ఎకరానికి ఒక కిలో సరిపోతుందని, అదే సూటి రకాలైతే రెండు కిలోల విత్తనాలు అధిక సాంద్రతలో సాగు చేసేటప్పుడు ఎకరానికి మూడు నుంచి ఐదు కిలోల విత్తనాలు అవసరం అవుతాయని వెల్లడించారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలని కిలో విత్తనానికి మొదట ఇమిడా క్లోప్రిడ్ 70 డబ్ల్యుఎస్ నాలుగు గ్రాములు కలిపి తర్వాత 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి లేదా సూడోమోనాస్ ఫ్లోరి సెన్స్‌ంతైరము 2.5 గ్రాముల విత్తన శుద్ధి చేయాలని సూచించారు. డిఏపి లేదా 20:20:0:13 లాంటి కాంప్లెక్స్ ఎరువులను వాడకూడదన్నారు. నత్రజని ఎరువులను సరైన మోతాదులో సకాలంలో వేయాలని, లేకుంటే పురుగు ఉధృతి ఎక్కువవుతుందని హెచ్చరించారు. ఒకే పొలంలో పంట మార్పిడి చేయకుండా పత్తిని అనేక సంవత్సరాలు పండించడం వల్ల పైరుపై జింక్, బోరాన్, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాల లోపం కనిపిస్తుందని, పూత, పిందే రాలడం, పండాకు తెగులు కూడా కనిపించడం జరుగుతుందని తెలియజేశారు.

నవతెలంగాణ
www.navatelangana.com
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 01 జూన్ 2023

రూ.2లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-కోటపల్లి



గత 20 రోజుల క్రితం ఉపాధి హామీ పనులకోసం వెళ్లి మృతి చెందిన చెన్నూర్ మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన మొగిలి లచ్చుకి ఈజీఎస్ ద్వారా మంజూరైన రు.2 లక్షల చెక్కును బుధవారం చెన్నూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతే తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నాపురెడ్డి బాపురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, సంకారం సర్పంచ్ చెడంక పున్నం, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎంపీడీఓ టి.శ్రీనివాస్, ఎంపీఓ అజ్మత్ ఆలీ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఆర్కే-6 శివారు, జైపూర్ మండల కాన్కూర్ గ్రామ శివారు మధ్యలో గుర్తుతెలియని శవం లభ్యమైనట్లు శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం గొర్ల కాపరి ఆర్కే-6 శివారులో వెళ్తుండగా రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఒక వ్యక్తి చనిపోయి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని పరిశీలించి వ్యక్తి వయసు సుమారు 60 నుండి 70 సంవత్సరాల వరకు ఉంటుందని, వ్యక్తి చేతికి రెండు రాగి కడాలు, కాషాయపు వస్త్రాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. శవానికి ప్రాథమిక పరీక్ష నిర్వహించి శవాన్ని పూడ్చినట్లు తెలిపారు. వ్యక్తిని ఎవరైనా గుర్తించిన ఎడల శ్రీరాంపూర్ సీఐ 8712656549, శ్రీరాంపూర్ ఎస్సై 8712656550 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పొగాకు ఉత్పత్తులకు ప్రజలు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని ఎమ్మెల్ హెచ్ పి సందీప్, హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, ఏఎన్ఎం అపరంజి అన్నారు. బుధవారం మండలంలోని తపాలాపూర్ గ్రామంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి పొగాకుతో తయారు చేయు సిగరెట్లు, బీడీలు తాగడం గుట్కాలు తినడం వల్ల వచ్చే క్యాన్సర్లు గుండె పోటులు ఇతర వ్యాధులను కలిగించే విధానాన్ని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా మాకు ఆహారం కావాలి కానీ పొగాకు కాదు అని గ్రామ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లలిత, విజయ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు షాట్‌సర్క్యూట్‌తో గుగ్లోత్ శంకర్ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ మవిషయం తెలుసుకున్న జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి బుధవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఓపెన్‌వర్శిటీ పరీక్షా కేంద్రం పరిశీలన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్శిటీ పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఓపెన్‌వర్శిటీ పరీక్షల నియంత్రణాధికారి పి.వెంకటరమణ సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ డిగ్రీ తర్వాత విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ పరీక్షల ఫలితాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం పరీక్షల నియంత్రణాధికారి వెంకటరమణను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.లక్ష్మీనరసింహం, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ టి దత్తాత్రేయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మంత్రి బాపు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సాదాసీదాగ సాగింది. ముందుగా ఆయా శాఖ అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మన ఊరు మన బడి శంకుస్థాపనకు సంబంధించిన ఇరిగేషన్ అధికారులు ప్రోటో కాల్ పాటించడం లేదని జడ్పీటీసీ మోతే తిరుపతి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఐహెచ్ఎల్‌లో బాగంగా మరుగు దొడ్లు నిర్మించుకున్న వారికి సరిగ్గా బిల్లులు ఎందుకు పడట్లేదని ఎంపీపీ మంత్రి బాపు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ బాపు రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ చల్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన పాల్వాయి పాదయాత్ర

నవతెలంగాణ-కౌటాల

బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు చేపట్టిన పాదయాత్ర బుధవారం రెండో రోజు కొనసాగింది. మండలంలోని తుమ్మిడిహేటి గ్రామంలో జెండా ఆవిష్కరించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణహిత నదిపై ఉన్న ఎత్తిపోతల పథకాలు సాండ్‌గాం తప్పా మిగతా ఎత్తిపోతల పతకాలు పనిచేయడంలేదని, తిరిగి మరమ్మత్తులకు కూడా నోచుకోలేదని ఆయన అన్నారు. వెయ్యి ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సిన ఎత్తిపోతల పతకాలు ఉట్టిపోతలుగా నిలిచిపోయాయని ఎద్దేవ చేశారు. సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వార్ధ, ప్రాణహిత నదులపై ఉన్న 17 లిఫ్టిరిగేశన్ స్కీంల మరమ్మత్తుల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అలసత్వం ఎందుకని ఆయన ప్రశ్నించారు. సుమారుగా 30 వేల ఎకరాల ఆయకట్టును బీల్లుగా మార్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మనకు అవసరమా అని విమర్శించారు. తుమ్మిడిహేటి, పీపీనగర్ గ్రామాల్లో పల్లెపల్లెకు పాల్వాయి గడపగడపకు బీజేపీ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నరూలె వానుపటేల్, మాజీ జడ్పీటీసీ ఎలుములె మల్లయ్య సీనియర్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, బండి రాజేందర్‌గౌడ్, కుంచాల విజయ్, ఎలుములె మధూకర్, తిరుపతి, గంగారాం పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు

- ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలి
- ప్రతి ఒక్క కార్మిక కుటుంబం పాల్గొనాలి



మందమర్రి ఏరియా జీఎం

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియాలోని గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిర్దేశించిన లక్ష్యానికి చేరుకుని మెరుగైన ఉత్పత్తిని సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి, ఉత్పాదకతపై వివరాలు వెల్లడించారు. ఆర్కే ఓసీ 108శాతం, కేకే ఓసి 95శాతం, కేకే-5 గని 93శాతంతో అధిక స్థాయిలో ఉత్పత్తి సాధించాయని, ఏరియా మొత్తంగా మే నెల ఉత్పత్తి సామర్థ్యం 375500 టన్నులు కాగా 336873టన్నులు లక్ష్యం సాధించి 90శాతం ఉత్పత్తి సాధించామన్నారు. ఏప్రిల్ నెలతో పోలిస్తే 21248టన్నులు అధికంగా ఉత్పత్తి సాధించడం జరిగిందని, డిస్పాచ్ విషయం లో కూడా 34000టన్నులు అధికంగా ఓబీ కూడా గత సంవత్సరంతో పోల్చి చూస్తే 3లక్షల 83వేలు అధికంగా ఉత్పత్తి చేయడం జరిగింది అని తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని జూన్ 02న జీఎం కార్యాలయంలో ఉదయం 09:15ని,, లకు జాతీయ పతాక ఆవిష్కరణ, రాష్ట్ర ఏర్పాటులో సింగరేణి సంస్థ కార్మికుల కృషి చేసిన పాత్ర పైన జీఎం, అధికారులు, కార్మిక నాయకుల ఉపన్యాసం ఉంటుందన్నారు. అలాగే సింగరేణి సంబరాలు జూన్ 05న సింగరేణి స్కూల్ మైదానంలో భారీ స్థాయిలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి ప్రగతి రన్ పేరుతో స్థానిక సీఈఆర్ క్లబ్ నుండి స్కూల్ ప్రాంగణం వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్, పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఏసీపీ, డీసీపీ సీఐ, ఎస్ఐలు ఇతర పట్టణ ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని అదే విధంగా నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, సింగరేణి ప్రత్యేక సాంగ్ ఆవిష్కరణ ఉంటుందని, వీటికి ప్రముఖ జానపద గాయని శిరీష ప్రత్యేక అతిథిగా హాజరవుతారన్నారు. తెలంగాణ సంస్కృతి, 10ఏండ్లలో సంస్థ సాధించిన పురోగతి అభివృద్ధి ప్రగతిపై వీడియో రూపంలో డాక్యుమెంటరి, వివిధ స్టాల్స్ ఏర్పాటు, ఐఐటీ ఐఐఎం, ఇంజనీరింగ్, మెడిసిన్ మెరిట్ స్టూడెంట్స్‌కి స్కాలర్షిప్, రీయంబర్స్‌మెంట్ చెక్‌ల పంపిణీ ఉంటుందని, వచ్చే వారందరికీ భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రజలు కార్మిక కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యి సింగరేణి సంబరాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, కేకే ఓసి పీఓ రమేష్, ఆర్కే ఓసి గోవిందరావు, ఏజీఎం నాగరాజు, ఐఈడి డిజీఎం రాజన్న, డిజీఎం సివిల్స్ శ్రీనివాసులు, సీనియర్ పీఓ మైత్రేయ బంధు, గ్రూప్స్ ఆఫీసర్ రమేష్‌లు పాల్గొన్నారు.



నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియా జీఎం

కార్మికుల సంక్షేమమే లక్ష్యం : జీఎం సంజీవరెడ్డి

నస్పూర్ : సింగరేణి బొగ్గు ఉత్పత్తితోపాటు కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సింగరేణి పనిచేస్తోందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే నెలలో శ్రీరాంపూర్ ఏరియాలో భూగర్భగనులో 103 శాతాన్ని సాధించినట్లు తెలిపారు. 1,36,500 టన్నుల ఉత్పత్తికి గాను 1,39,920 టన్నులు సాధించిందన్నారు. ఉపరితల గనుల్లో 4,90,000 ఉత్పత్తిగాను 4,39,578 టన్నులు సాధించి 90 శాతం ఉత్పాదకత సాధించిందని, మొత్తంగా 92 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్పత్తితోపాటు కార్మికులకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని, కార్మికుల పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్, స్పోర్ట్స్ ట్రైనింగ్ క్యాంప్స్, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ రెండవ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూన్ 5వ తేదీన సింగరేణి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. సింగరేణి సంబరాల్లో భాగంగా అన్ని గనుల్లో జెండా ఆవిష్కరిస్తారని, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి, అమర వీరుల స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీరాంపూర్ బస్టాండ్ నుంచి ప్రగతి స్టేడియం వరకు 1000 మందితో తెలంగాణ సంస్కృతి కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రగతి స్టేడియంలో నిర్వహిస్తున్న సాంస్కృత కార్యక్రమాల్లో భాగంగా స్టాల్స్‌ని ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాకముందు సింగరేణి ప్రగతి, తెలంగాణ సాధించుకున్న తర్వాత సింగరేణి అభివృద్ధిని తెలిపేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు డైరెక్టర్ బలరాం అధ్యక్షత వహిస్తారని, ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సింగరేణి సంబరాలను పురస్కరించుకొని ప్రతి ఒక్క ఉద్యోగికి రూ.200 విలువగల స్వీట్ బాక్సులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడి చిరంజీవులు, సీనియర్ పిఓ కాంతారావు పాల్గొన్నారు.

తెలంగాణ ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలి

- రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సింగరేణి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, డీఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్, డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 9 సంవత్సరాలు పూర్తి చేసుకొని 10వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో పండుగ వాతావరణంలో వైభోవపేతంగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జారీ చేసిన కార్యచరణ ప్రకారం జూన్ 2 నుండి 22వ తేదీ వరకు 21 రోజుల పాటు ప్రతి రోజు కేటాయించిన కార్యక్రమాలను నిర్దిష్ట ప్రణాళికతో ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, కార్యక్రమాలకు సంబంధించిన సామాగ్రి అందించడం జరుగుతుందని, విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జూన్ 2న అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించాలని, 3వ తేదీన తెలంగాణ రైతు దినోత్సవం నిర్వహణకు నియమించిన ప్రత్యేక అధికారులు వారి పరిధిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని, ఈ క్రమంలో జిల్లాలోని 55 రైతు వేదికలను అందంగా అలంకరించి రైతు సంక్షేమ పథకాలపై ఊరూరా డప్పు చాటింపు చేయించి, ర్యాలీలు నిర్వహించాలన్నారు. ప్రతి రైతు వేదిక వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. 21 రోజుల పాటు చేపట్టే కార్యక్రమాలలో ఎలాంటి పొరపాట్లు జరుకుండా పూర్తి స్థాయి కార్యచరణ రూపొందించుకొని ప్రణాళికబద్ధంగా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి అంశంలో జాగ్రత్త వహించాలని, ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



రైతుల సంక్షేమానికి సహకార సంఘాల బలోపేతం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్ సమీపంలో నూతనంగా నిర్మించిన జిల్లా సహకార బ్యాంకు, గోదాములను డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, అదనపు కలెక్టర్‌లు చాహత్ బాజ్‌పాయి, రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతును రాజు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో రైతు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా వారి ఆర్థిక అభివృద్ధి సాధ్యమైందన్నారు. గతంలో వ్యవసాయం దండగ అనే సామెత ఉండేదని ప్రస్తుతం పండగల మారిందన్నారు. సహకార సంఘాల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీసీసీబీ గోదాం ద్వారా రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రైతులకు సేవలు అందించే విధంగా అధికారులు కూడా ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాదనేని మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ అలిబిన్ హైమద్, వైస్ చైర్మన్ ప్రహల్లాద్, డీసీఓ తారామణి, సీఈఓ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు ఆరేందుల మురళి పాల్గొన్నారు.



ఇంటింటికి సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-జన్నారం

ఇంటింటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని చింతాగూడ లక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పల్లె పల్లెకు రేఖ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చింతగూడ గ్రామంలో అన్ని వాడలలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, వంటి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చసి అభివృద్ధి చేశామన్నారు. ప్రతి ఊరిలో డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక, రైతు వేదికలు ప్రతి వాడలలో సిసి రోడ్ నిర్మాణాలను చేపట్టి పల్లెలను అభివృద్ధి చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రజలను కోరారు. మండల అధికార యంత్రాంగంతో చింతగూడ గ్రామంలో పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ బుచ్చన్న, వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, జిల్లా నాయకులు సిటీమల భరత్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, చింతగూడ మాజీ ఎంపీటీసీ సుతారి సుమలత, మహిళా అధ్యక్షురాలు మామిడి సుశీల అన్యకాంతామని పాల్గొన్నారు.

తరుగు లేకుండానే ధాన్యం కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-వేమనపల్లి

ఎలాంటి తరుగు లేకుండానే ప్రతి రైతు వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నెల రోజుల నుండి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయక పోవడం చాలా దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని వేమనపల్లి మండల కేంద్రం, వేమనపల్లి, దస్నాపూర్ మంగేనపల్లి, ఐకేపీ కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులను, లారీ అసోసియేషన్ నాయకులను కలిసిన అనంతరం చంద్రశేఖర్ మాట్లాడారు. ఒక్కో క్వింటాల్ కు తరుగు పేరిట పది కిలోల వరకు కోత విధించడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. దీంతోపాటు నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో లారీలు అన్లోడ్ కాకుండా(ఖాళీ చేయకుండా) ఉంటున్నాయని తెలిపారు. పర్యావసానంగా సమయానికి లారీలు దొరక్క మిగతా రైతులు ఇబ్బందుల పాలు కావలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. త్వరితగతిన ధాన్యం కొనుగోలు జరగాలంటే ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం కావాలని చంద్రశేఖర్ సూచించారు. ఇందులో భాగంగా వెంటనే రైస్ మిల్లులలో సమీక్షించి చర్యలు జరపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా లారీలు అన్‌లోడ్ అయ్యే విధంగా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. వారం రోజుల్లో కేవలం 7 లారీలు అన్‌లోడ్ అయ్యాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అవగతం తీసుకోవచ్చని చంద్రశేఖర్ వాపోయారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అందె పురుషోత్తం, దేవరబోయిన చిన్నశంకర్, అందె మహేష్, తోకల హనుమంతు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక 14వ వార్డ్ మల్లికార్జున్‌నగర్‌కు చెందిన ఐదో తరగతి విద్యార్థిని ఏల్పుల రవిశ్రేణికి విశాక ట్రస్ట్ ద్వారా బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు జంగంపల్లి మల్లయ్య, వైద్య శ్రీనివాస్ బుధవారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. రవిశ్రేణి ఓ ప్రైవేటు స్కూల్లో ఐదో తరగతి పూర్తి చేసి ఇటీవల మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో అర్హత సాధించింది. రుపేద కుటుంబానికి చెందిన రవిశ్రేణి తండ్రి చనిపోవడంతో తల్లి స్వరూప కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ప్రైవేటు స్కూల్లో విద్యార్థినీ డ్యూ ఫీజును చెల్లించలేని కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న బీజేపీ నాయకులు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి బాలికకు విశాకట్రస్ట్ ద్వారా రూ.10వేలను అందించారు. ఆపదలో ఆదుకున్న వివేక్ వెంకటస్వామి విశాక ట్రస్ట్ వారికి విద్యార్థిని కుటుంబీకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు బాబుగౌడ్, సభ్యులు సంతోష్, శ్యామ్, ఆశిష్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 01 జూన్ 2023

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

ఆసిఫాబాద్ : జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా అంతటా జూన్ 30 వరకు పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పి సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని సూచించారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరానికి పురిగొల్పే ఎటువంటి ఆయుధాలు వాడరాదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం పోగయ్యే వంటివి నిషేధమని తెలిపారు. జిల్లాలో 30 యాక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఈ నియమ నిబంధనలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు, మిలిటరీ అధికారులకు, విధినిర్వహణలో ఉన్న హోంగార్డ్స్, అంత్యక్రియ ఊరేగింపులకు వర్తించవని పేర్కొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడా రైతు వేదికలో బుధవారం అధిక సాంద్రత పత్తి సాగుపై నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితులలో అధిక సంఖ్యలో రైతులు అధిక సాంద్రత పత్తి సాగుపై మక్కువ చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా వారికి వివిధ వంగడాలపై అవగాహన కల్పించారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సస్యరక్షణ పద్ధతుల గురించి చీడపీడలు నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సీడ్స్ మార్కెట్ మేనేజర్ డి శ్రీనివాస్ ఆర్ఎం శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటి ఆర్ఎం రామ్మోహన్, ఎస్ఎస్ఓ సాయినాథ్, శివకుమార్ ఏఈవోలు విలాస్, ప్రవీణ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని ముత్యంపల్లి ప్రభుత్వ దవాఖాన ఆవరణలో బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రోడ్డా లక్ష్మి, వైస్ ఎంపీపీ విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణా రెడ్డిలు కేకు కట్ చేసి, రోగులకు అరటి పండ్లు పంచి పెట్టారు. ఈ కార్య క్రమంలో ఎంపీటీసీలు కొండబ త్తుల రాంచెందర్, అక్కెపల్లి లక్ష్మి, సర్పంచ్ రామటెంకి శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు బోయిని తిరుపతి యాదవ్, పిట్టల సుమన్, సూర్యప్రకాష్, బీఆర్ఎస్ కార్యదర్శి మోటురి వేణు, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, మార్కెట్ కమిటి డైరెక్టరు మంజూళారెడ్డి, పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు మద్దెవెణి వేణు, నాయకులు ప్రభాకర్, సుధాకర్, పెంటు, ప్రెంకుమార్, ఇంతియాజ్ మహ్మద్, అంజి యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో బుధవారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్షణ ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించి వారికి క్యాడర్ వారిగా పేస్కేల్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వృకోధర్, ఉదారి నారాయణ, శ్యాముల్, నాగేందర్, గౌస్‌ఉద్దీన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీని అరికట్టాలి



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ధాన్యం కొనుగోళ్లలో దోపిడీని అరికట్టాలని మండలంలోని సిర్గాపూర్ గ్రామ జాతీయ రహదారిపై రైతులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి తూకంలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా రైస్ మిల్లర్లకు తరలించాలన్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై గంగాధర్ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

దివ్యాంగుల పోరాటానికి పాయల్ శంకర్ మద్దతు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ముందు దివ్యాంగులు చేపట్టిన నిరవధిక దీక్షకు బుధవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు మరో కాలనీ ఏర్పాటు చేసి అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు ఇవ్వాల్సిన పెన్షన్లు ఇవ్వకుండా వారిని ఇబ్బంది పెట్టడం అమానవీయమని తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద వారికి ఇండ్లు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ముకుంద్, దినేశ్ మటోలియా, మయూర్ చంద్ర ఉన్నారు.

వైద్య శాఖలో ఖాళీలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వైద్య శాఖలో వివిధ విభాగాల్లో ఆయుష్ వైద్య అధికారుల పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 3లోపు జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారమ్స్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆసిఫాబాద్. తెలంగాణ.గౌ.ఇన్ నుండి పొందవచ్చన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-భీమిని

మండలంలో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు కార్యచరణ రూపొందించాలని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అన్ని శాఖల అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉత్సవాలపై మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మిదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ 20 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జడ్పిటిసి పోతురాజుల గంగక్క,మండల ప్రజా పరిషద్ ఉపాధ్యక్షులు చిలుముల మధు,మండల సర్పంచులు, మండల పంచాయతీ అధికారి షేక్. సఫ్దర్ అలి,తహశీల్దార్ పి.రాజయ్య ,మండల విద్యా అధికారి మహేశ్వర రెడ్డి, ఏ.వో విజయ్ కుమార్, ఏపిఎం ప్రకాష్ గౌడ్, ఏపీవో భాస్కర్ రావు మరియు సమస్త పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌటాల : దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 20 రోజుల పాటు దశాబ్ధి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రణాళిక బద్ధంగా దశాబ్ధి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌటాల ఎంపీపీ

సమావేశంలో తహసీల్దార్ సాయన్న, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, వ్యవసాయాధికారి రాజేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దండేపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన విధంగా ప్రతిరోజు కార్యక్రమాలు విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతమయ్యేలా చూడాల్సిందిగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి సంబరాలను విజవంతం చేయాలి

నస్పూర్ : జూన్ 5వ తేదీన నిర్వహించే సింగరేణి సంబరాలను దిగ్విజయం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి కార్మికులను కోరారు. బుధవారం ఆర్కే-7 గనిపై ఉద్యోగులు, కార్మికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ అన్ని విధాల అభివృద్ధిలో ముందుకు వెళుతుందని, సింగరేణి సాధించిన అద్భుత ప్రగతిని ప్రతి ఒక్క ఉద్యోగి తెలుసుకోవడానికి సింగరేణి సంబరాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులందరికీ సింగరేణి సాధించిన అద్భుత ప్రగతిని వివరిస్తూ గనులపై మూడు షిఫ్ట్‌లలో సమావేశాలను ఏర్పాటు చేసుకొని, కార్మికులు వారి కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్క ఉద్యోగి పాటుపడాలని పర్యావరణ రక్షించుకోవడం మన బాధ్యత అని, సింగరేణి సంస్థ ద్వారా హరితహర కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 7 గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణాధికారి రవిశంకర్, అందరి మేనేజర్లు రవీందర్, వెంకటరామ్, శ్రీనివాస్, పీటీ ఇంజనీర్ ప్రవీణ్ సంక్షేమ అధికారి సంతన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నస్పూర్ ఎంపీపీ

ఉద్యోగల విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

జనరల్ మేనేజర్ కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవి విరమణ పొందుతున్న రాళ్ల బండి రాజన్నను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సంస్థలో 36 సంవత్సరాల 6నెలల సుదీర్ఘ సేవలందించిన రాళ్ల బండి రాజన్న అభినందనీయులని, వారు సింగరేణి సంస్థకు చేసిన సేవలను కొనియాడారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, శివరావు, ఫైనాన్స్ మేనేజర్ పద్మ డివైపిఎం రాజేశ్వేర్‌రావు, సీనియర్ పీఓ పి.కాంతారావు, సీనియర్ ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నస్పూర్‌లో..

కాసిపేట : కాసిపేటగనిలో ఉద్యోగం చేసి పదవి విరమణ పొందిన గోదార్ల శంకర్(యాక్టింగ్ వెల్డర్)కు మేనేజర్ అల్లావుద్దీన్, యూనియన్ ప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత గోదార్ల శంకర్ మాట్లాడుతూ నేటి యువత వ్యసనాలకు దూరంగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయడం వల్లనే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. మేనేజర్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ 36 సంవత్సర కాలం కంపెనీకి వెల్డర్‌గా భాధ్యతగా విధులు నిర్వహించారని కొనియాడారు. అంతకు ముందు ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు దాగం మల్లేష్, ఒడ్నాల రాజన్న మాట్లాడుతూ శంకర్ కంపెనీకి ఎప్పుడు అందుబాటులో ఉంటూ మంచి పని నైపుణ్యతను చూపించే వారని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి సునీల్ కుమార్, పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మి నారాయణ, సంక్షేమాధికారి గౌస్, బన్న లక్ష్మన్‌దాస్, అబ్దుల్, రమేష్, మైఖేల్, రాజేందర్, సోల్లంకి శ్రీనివాస్, వెంకట రాజం, లింగయ్య, సురేష్, బెల్లం అశోక్ పాల్గొన్నారు.



కాసిపేటలో..

అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ



నవతెలంగాణ-కోటపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని పీసీసీ సభ్యుడు నూకల రమేష్ అన్నారు. బుధవారం చెన్నూర్ మండలంలోని అన్నారం గ్రామంలో హత్ సే హత్ జోడో కార్యక్రమంలో భాగంగా గడపగడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నూకల రమేష్ మాట్లాడుతూ అన్నారం గ్రామ ప్రజల పత్తి పంటను ప్రణహిత నది రెండు పర్యాలు ముంచిన ఏ ఒక్క రైతుకు పంట నష్టాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పంట నష్టపరిహారం అందిస్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అధికారులు మాటలు చెప్పడమే తప్ప ప్రజల సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకేసారి రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అన్నారు. ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఆశ చూపి అధికారంలోకి వచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పునాది దశలోనే దర్శనమిస్తున్నాయని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ తెలంగాణ ఆడపడుచులకు అందిస్తామని అన్నారు. నిరుద్యోగులకు రూ.4000 నిరుద్యోగ భృతి ఇస్తామని తెలిపారు. ప్రతి అమ్మ అక్కలు కాంగ్రెస్ అధికారాన్ని చేపట్టే విధంగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ డేలిగేట్ జనగామ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారుపాక సుఖేందర్, యువజన కాంగ్రెస్ మండల నాయకులు, దొబ్బల సంపత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోడె గణపతిరెడ్డి, గొల్లగట్టు రవి, మధు, ఉత్తుర్లా రాజేష్, మద్ది అశోక్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రోటి గుడాలో బుధవారం లేబర్ కార్డు కలిగి ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఆ గ్రామ సర్పంచ్ మల్క విజయ లక్ష్మణ్ ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు వైద్య శిబిరాన్ని, నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్‌ను అభినందించారు. గ్రామంలో లేబర్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు గోలీలను అందించడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ కళ్యాణం సంతోష్, మేనేజర్ గోట్ల రాజు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూన్ 3 నుండి 17 వరకు జరిగే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో అన్ని స్థాయిల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులతో పాటు ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులు పాల్గొనేలా చేసి పండగ వాతావరణంలో పిల్లల నమోదు ప్రక్రియను నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో విద్యార్థుల నమోదు కార్యక్రమంలో ఎక్కువ నమోదు చేసిన వారికి ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఎస్ఎంసి చైర్మన్‌లకు తల్లిదండ్రులకు ఆర్థికంగా సహాయపడిన స్వచ్ఛంద సంస్థలకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అదేవిధంగా మన ఊరు మనబడి ద్వారా ప్రభుత్వం పాఠశాలలకు అన్ని రకాల వసతులు సమకూర్చుతున్నారని, జిల్లాలోని 37 ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధనకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వాటిలో ఇంగ్లీష్ మీడియంలో కూడా బోధన జరుగుతుందని విద్యార్థులు తల్లిదండ్రులు జిల్లాలోని అన్ని పాఠశాలలో నమోదు ప్రక్రియను విజయవంతం చేయాల్సిందిగా సూచించారు. పదవ తరగతిలో వెనుకబడిన వారి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలో పాస్ అయ్యే విధంగా ఎలా శిక్షణ ఇవ్వాలో ప్రభుత్వ పరీక్షల జిల్లా అధికారి ఏసిజి ఉదయబాబు తెలియజేశారు. పాఠశాలలో మన ఊరి మనబడితో పాటు ప్రధానోపాధ్యాయులు కార్యశాల సిద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా పాఠశాలను అన్ని రకాల వసతులను కల్పిస్తూ గుణాత్మక విద్యను అందించవచ్చని కోఆర్డినేటర్ సుభాష్ తెలియజేశారు. కోఆర్డినేటర్ జంబోజు సత్తయ్య మాట్లాడుతూ జిల్లాలో ఉచిత యూనిఫామ్స్ 1071 పాఠశాలలో 53101 మంది విద్యార్థులకు యూనిఫాం కుట్టించి ఇచ్చే విధంగా స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు మండల విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆబీదలి, రాము, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడు ఆదర్శనీయుడు



నవతెలంగాణ-నార్నూర్

గౌతమ బుద్ధుడు ఆదర్శనీయుడని జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం మండలంలోని దుప్పాపూర్ గ్రామంలో బుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన, అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మరియు బుద్ధ విహార్ శంకుస్థాపన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమతా సైనిక్ దళ్ జాతీయ నాయకులు దిగంబర్ కాంబ్లే కుటుంబ సభ్యులు తమ తల్లి జ్ఞాపకార్థం బుద్ధుడి విగ్రహన్ని ప్రతిష్ఠించారన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన సమతా సైనిక్ దళ్ దక్షిణ భారత ఉపాధ్యక్షుడు రెంజర్ల రాజేష్ మాట్లాడుతూ బుద్ధుడు చూపించిన మార్గంలో ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, సమతా సైనిక్ దళ్ జాతీయ నాయకులు మార్షల్ దిగంబర్ కాంబ్లే, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ దుర్గం శేఖర్, భంతే ధమ్మసార్, అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ యునుస్ అక్బాని, సర్పంచ్ సేవంత ప్రభాకర్, ఎంపీటీసీ పరమేశ్వర్, గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, బాలాజీ కాంబ్లే, ధమ్మరథ బుద్ధ విహార్ కమిటీ సభ్యులు శ్రీరంగ్, విశ్వజిత్, మధుకర్, జ్ఞానోబా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బావులకు మోటార్లు అమర్చడానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని బావులకు మోటార్లు అమర్చడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెక్సమో, క్రై కెఎస్బి, ఆర్యన్, ఫాల్కన్ కంపెనీలకు సంబంధించిన మోటార్లు బిగించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఆసక్తిగలవారు 6 నుండి 20 మోటార్లకు కావలసిన పరికరాలు అందించే అనుమతి కలిగి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్ గ్రామంలో భీమన్న దేవుని విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని భాజా భజంత్రీల మధ్య ఊరేగింపు నిర్వహించారు. పండితులు సంతోష్ శర్మ యోగేష్ శర్మ, నరేష్ శర్మ, సిద్ధిత్ శర్మ, మణిదీప్ శర్మ, సృష్టిత్ శర్మ ఆధ్వర్యంలో స్వస్తి పుణ్యాహవాచనము, గణపతి, గౌరీ పూజ, భీమన్న విగ్రహ జలాధివాసం, పుష్పాదివాసము, దాన్యాధివాసము జరిపారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని నాయక్‌పోడ్ కులస్తులు తెలిపారు.